క్లుప్తంగా

బాంసెఫ్ శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న నేతలు

చింతలపూడి : బహుజన భావజాలం, సిద్ధాంతం మాత్రమే నేటి సమస్యలకు పరిష్కారం అని బాంసెఫ్ జిల్లా కన్వీనర్ అలుగుల సాయిరాజు అన్నారు. చింతలపూడిలో దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయీ ఫెడరేషన్ (బాంసెఫ్) నియోజక వర్గ శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్, పూలే, గౌతమ బుద్ధుని బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో పాలపర్తి బాలాజీ, వీరదాస్, కాకర్ల సత్యన్నారాయణ, బీవీఎస్ఎన్ రాజు, విజయానంద్, కె.శ్రీనివాస్, బి. ప్రసాద్‌రాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన హాసం క్లబ్ కార్యక్రమం



హాసం క్లబ్ సీనియర్ సభ్యుడు తల్లాప్రగడ సుబ్బారావును సన్మానిస్తున్న సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే ప్రత్యేక హాస్య కదంబ కార్యక్రమం స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు జోకులు చెప్పడం, వివిధ చిత్రాల్లోని హాస్య సన్నివేశాలను వివరించి నవ్వులు పూయించారు. అనంతరం పలువురు సభ్యులు పలు సినీ గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హాసం క్లబ్ సీనియర్ సభ్యుడు తల్లాప్రగడ సుబ్బారావును ఘనంగా సత్కరించారు. హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్ఆర్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీహరి కోటి, ఎస్.బాబి, ఎం.బెనర్జీ, బి.నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

138 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద నేత్రవైద్యశాలకు చెందిన వైద్యులు 138 మంది పేదలకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. అలాగే 32 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు. కార్యక్రమంలో బొల్లిసెట్టి సురేష్ కుమార్, కంది బాలకృష్ణ, పి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

విజ్ఞానంతోపాటు వినోదం



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హేలాపురి చిల్డ్రన్ క్లబ్, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల్లో విజ్ఞానం పెంచి వినోదం పంచుతోందని ఏపీ ఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో రెండో రోజు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో తెలుగు భాష, సులభ గణితాలను తులసి, సీహెచ్ జగదీష్ నేర్పారు. డ్రాయింగ్‌ను చిత్రకారులు మజ్జి కాంతారావు నేర్పారు. 100 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ బడి సెలవుల్లో బాలలు, విద్యార్థులు టీవీలకు అతుక్కుపోవడం వివిధ రంగాల్లో వారికి విజ్ఞానం పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీజీఎంవీఆర్ కృష్ణా రావు, వి.సురేష్, సీహెచ్ గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన నిత్యసహాయ మాత ఉత్సవాలు

దెందులూరు: పోతునూరు శివారు ఉంగ్రాజవరంలో నిత్యసహాయ మాత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ. డేవిడ్‌రాజు ప్రత్యేక నిత్య పూజాబలి అర్పించారు. ఉంగ్రాజవరం ఆర్‌సీఎం సంఘ పెద్దలు, యువత, మరియదళ సభ్యులు, నిత్యసహాయ మాత ప్రతిమతో ర్యాలీ నిర్వహించారు.

అట్టహాసంగా గంగానమ్మ జాతర ప్రారంభం



పాంగుటూరు గ్రామ సరిహద్దులో పొలిమేర తోరణం కడుతున్న గ్రామస్తులు



ఆకట్టుకున్న వివిధ విచిత్ర వేషధారణలు

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగున్నర దశాబ్దాల అనంతరం జాతర నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు వేలాదిగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించగా గ్రామ నలువైపులా పొలిమేర తోరణాలు కట్టారు. మతాలకు అతీతంగా గ్రామస్తులు తరలివచ్చి గంగానమ్మ శరణు ఘోషతో తోరణాల రాటల్ని నిలబెట్టారు. తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం, ఎర్రంపేట, యర్నగూడెం రోడ్లలో తోరణాలను కట్టిన పిదప అమ్మవారిని సాదరంగా పుట్టింటికి పుట్టింటి ఆడపడుచులు ఆలయానికి (పుట్టిల్లు) తోడ్కొని వచ్చారు. నిర్విరామంగా రెండు గంటలపాటు బాణసంచా పేలుళ్లతో అమ్మవారి శరణు ఘోషతో మెయిన్ సెంటర్ మార్మోగింది. సాయంత్రం నుంచి జబర్దస్త్ నటీనటులు చిత్రం శ్రీను, విజయ్, చిట్టిబాబు, మురళి, స్రవంతి తదితరులు వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు జబర్దస్త్ బుల్లితెర నటులతో కామెడీ షోలు, అదే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 31వ తేదీన హైపర్ ఆది కామెడీ షోలో పాల్గొననున్నట్లు సర్పంచ్ పసుపులేటి రాంబాబు తెలిపారు.

మద్ది అంజన్న సన్నిధిలో..



మేజిస్ట్రేట్ తేజశ్వికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని ఆదివారం జంగారెడ్డిగూడెం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కాళహస్తి రాజరాజేశ్వరీ తేజశ్వి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను ఈవో కొండరాలవు మేజిస్ట్రేట్ రాజరాజేశ్వరీ తేజశ్వికి అందజేశారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సేవ కేంద్రం ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రగళ్లపాటి కాశీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌత సత్యేంద్ర పాల్గొని మాట్లాడారు. రాజీవ్ గాంధీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆనాడు దేశ ప్రధానిగా భారతదేశాన్ని కమ్యూనికేషన్ రంగంలో ముందుకు నడిపించి టెక్నాలజీ, డిజిటలైజేషన్‌కు కారణమయ్యారన్నారు. అంతేకాకుండా పంచాయతీ మున్సిపాలిటీలకు కేంద్ర నిధులు డైరెక్టుగా వెళ్లే విధంగా చట్టం చేసి స్థానిక సంస్థలను బలోపేతం చేసిన నాయకుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరవల్లి సోమేశ్వరరావు, మామిడి రాము, తాడేపల్లి ఉమాదేవి, కుమారి, మొగిలినీడి శ్యామ్, గోపిశెట్టి ప్రసాద్, జ్ఞానే, రామసూరి రెడ్డి, వసంతాటి మంగరాజు, కసింకోట సతీష్, బుడుపుల ప్రసాద్, లంకలపల్లి శ్రీను, బోను దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



బుట్టాయగూడెంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పైదా పోతురాజు, చిడిపి కుటుంబ రావు, అర్జునరావు, భీమరాజు, బాపిరాజు, కుంజా భీమరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : వేసవి వినోదం పేరుతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ, కార్యదర్శి ఉడా రాంగోపాల్, యువజన విభాగం చైర్మన్ రాఘవరాజు ఆదివిష్ణు తెలిపారు. ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులకు చదరంగం పోటీలు నిర్వహించారు. రోటరీ హ్యాపీ స్కూల్ చైర్మన్ అయినపర్తి చంద్రశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో 50 మంది చిన్నారులు పాల్గొన్నట్లు దాకారపు కృష్ణ తెలిపారు. సీనియర్ విభాగంలో 30 మంది, జూనియర్ విభాగంలో 20 మంది పాల్గొన్నారని, వీరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు రోటరీ కార్యదర్శి రాంగోపా తెలిపారు. కార్యక్రమంలో ఉమర్ ఆలీ,, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



సీతంపేట జాతీయ రహదారి వద్ద సబ్జా చలివేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

కొయ్యలగూడెం : సీతంపేట వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో సబ్జాగింజల పానీయ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు యడ్లపల్లి కృష్ణ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంకి చెందిన డీకేడి సత్యనారాయణ సౌజన్యంతో ఈ చలివేంద్రం జూన్ నెలాఖారు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్జా గింజలతో పానీయాన్ని తయారుచేసి రక్షిత శీతల తాగునీటిలో కలిపి చలివేంద్రం ద్వారా దాహార్తులకు అందిస్తామని కృష్ణ తెలిపారు. రోజుకు నాలుగు వందల మందికి సరిపడా రక్షిత తాగునీటిని పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

కొల్లి నాగేశ్వరరావుకు నివాళి



నాగేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న నాయకులు

చింతలపూడి : జాతీయ రైతు సంఘం నాయకులు కొల్లి నాగేశ్వరరావు వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగేశ్వర్రావు చిత్రపటానికి పలువురు రైతు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కె గురవయ్య మాట్లాడుతూ జలవనరుల మీద కొల్లి నాగేశ్వరరావు రచించిన పుస్తకాన్ని ఆనాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించి జలవనరుల శాఖకు అధ్యయనానికి పంపించారని కొనియాడారు. మండల రైతు సంఘం కార్యదర్శి దొంతా కృష్ణ మాట్లాడుతూ నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తడికమళ్ళ ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న గిరిజనులు

కొయ్యలగూడెం : పర్యావరణ ప్రాముఖ్యతపై గిరిజన గ్రామాలలో అటవీశాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు సమావేశాలు ఆరవ రోజుకు చేరాయి. డీఆర్వో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కన్నాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాలలోని తంగెళ్లగూడెం, బిల్లిమిల్లి, పులిరామన్నగూడెం, కన్నారప్పాడు గిరిజన గ్రామాలలో పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలలోని ప్రజలు భాగస్వాములు అయ్యేలా చేస్తున్నామని డీఆర్‌ఓ తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడడంతోపాటు దానివల్ల కలిగే ప్రయోజనం, ప్లాస్టిక్ వాడకం వలన దుష్పరిణామాల గురించి ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఎఫ్‌బీఓలు రాంబాబు, రామయ్య, పోశయ్య, రాంప్రసాద్ గిరిజన గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: రైతుల సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ కోరారు. మానవతా దృక్పథంతో రైతులను ఆదుకోవాలని క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు శాశ్వతంగా పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఆయన కోరారు. ఆదివారం ఉంగ్రాజవరంలో రైతులతో సమావేశం నిర్వహించారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి చేయూత

పిల్లల పేరున బ్యాంకులో రూ. 2 లక్షలు డిపాజిట్



నగదు డిపాజిట్ బాండ్‌లను చూపుతున్న నాగబాబు పిల్లలు

ద్వారకాతిరుమల: కోవిడ్ వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో గ్రామ ప్రజలకు విశిష్ట సేవలందించి, ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన ఒక పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆ గ్రామస్తులు చేయూతనిచ్చారు. వివరాల్లోకి వెళితే. మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మానికల నాగబాబు(35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గుణ్ణంపల్లి పంచాయతీ పరిధిలో గత కొన్నేళ్లుగా నాగబాబు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. కోవిడ్ విలయతాండవం చేసిన సమయంలోనూ తన సేవలను ప్రజలకు అందించారు. నాగబాబు మృతి చెందడంతో పలువురు గ్రామస్తులు అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో దాతలు ముందుకు రావాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. వీటికి స్పందించిన పలువురు దాతలు మృతుడి కుటుంబానికి పలు రకాలుగా సహాయాన్ని అందించారు. దాంతో పాటు సేకరించిన రూ. 2 లక్షల నగదును నాగబాబు కుమార్తె బాలనాగ సత్య అంజలి పేరున, అలాగే కుమారుడు రిష్యేంద్ర పేరున గుణ్ణంపల్లిలోని సొసైటీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వీటిని పిల్లలు మేజర్లు అయిన తరువాత మాత్రమే తీసుకునేలా డిపాజిట్ చేసినట్లు దాతలు తెలిపారు. పారిశుధ్య కార్మికులను, వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దాతలు పేర్కొన్నారు. డిపాజిట్ బాండ్‌లను బాధిత కుటుంబ సభ్యులకు అందించిన వారిలో డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ ముల్లంగి వెంకట రామిరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి, గౌతంరెడ్డి, అనూష్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరీ లైఫ్ – మేరా స్వచ్ఛ సహార్ అనే కార్యక్రమంలో భాగంగా పర్యావరణ అనుకూల అలవాట్లను, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ త్రిబుల్ ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్) ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో వలంటీర్లను భాగస్వాములను చేస్తూ త్రిబుల్ ఆర్ సెంటర్లకు వస్తువులను అత్యధికంగా సేకరించిన వలంటీర్లకు నగదు బహుమతి అందిస్తామని చెప్పారు. ఈనెల 24న రెడ్యూస్ కార్యక్రమంలో భాగంగా వాడేసిన పాతబట్టల సేకరణ చేయాలని, 25న రీయూజ్‌లో భాగంగా తిరిగి వాడుకోవటానికి ఉపయోగపడే పుస్తకాలు, ఆటబొమ్మలు, పాత ఇంటిపాత్రలు సేకరించాలని, 26న రీసైక్లింగ్‌లో వాడేసిన పేపర్లు, అట్టలు, ప్లాస్టిక్ కవర్లు సేకరించి త్రిబుల్ ఆర్ సెంటర్లకు అందజేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ సెంటర్లకు అధిక పరిమాణంలో సేకరించిన వలంటీర్లకు నగదు బహుమతులు అందజేస్తామని కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. మొదటి బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.5వేలు, రెండవ బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.3వేలు, మూడవ బహుమతిగా ముగ్గురు వలంటీర్లకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. వీరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5న జరిగే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. అదేవిధంగా నగరంలోని డ్వాక్రా సంఘాల సభ్యుల సహకారంతో త్రిబుల్ ఆర్ సెంటర్లకు వస్తువులను ఎక్కువగా సేకరించిన రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ)లను ఎంపిక చేసి నగదు బహుమతి అందిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలు చొప్పున అందిస్తామని నగర కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత అప్పారావు దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 3,00,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా విజయవాడకు చెందిన వద్దూరి వెంకట అప్పారావు, వెంకట దుర్గానాగలక్ష్మి రాజేశ్వరి దంపతులు చెరో రూ. 1,00,116 చొప్పున మొత్తం రూ. 2,00,232, అలాగే విజయవాడకు చెందిన వేలాపురం భాస్కర శ్రీనివాస్ లక్ష రూపాయలను విరాళంగా ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓలు పి.నటరాజారావు, కేవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఉంగుటూరు: వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇళ్ల నుంచి అత్యవసరమైతే గాని బయటకు రావద్దని డైమండ్స్ లయన్స్ క్లబ్ డైరెక్టరు కోనా శ్రీనినవాసు అన్నారు. ఆదివారం కైకరం జాతీయ నాయకుల విగ్రహాల వద్ద లయన్స్ అధ్యక్షుడు కోనా హనుమాన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, లయన్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జంగారెడ్డిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 8వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4.30 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొంటారన్నారు. పేరంపేట రోడ్డు చిన్న రామాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొనాలని కోరారు.

రేపు వలంటీర్లకు పురస్కారాలు

కొయ్యలగూడెం : వలంటీర్లకు పురస్కార కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తారన్నారు. మొత్తం 383 మంది వలంటీర్లకు గాను 378 మందికి సేవా మిత్ర పురస్కారాలు, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలకు ఎంపిక అయ్యారన్నారు.

లక్ష్మీపురంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం

పెదవేగి : వాతావరణం ఒక్క సారిగా మారి ఆదివారం రాత్రి వీచిన పెనుగాలుల తీవ్రతకు పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయని ట్రాన్స్‌కో పెదవేగి ఏడీ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 32 విద్యుత్ స్తంభాలు, విరిగి పడ్డాయని, ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయని, కండక్టర్ (విద్యుత్ వైరు) చాలా వరకు ధ్వంసమైందని ఆయన చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని, విద్యుత్ స్తంభాలను కొత్తవి ఏర్పాటు చేయడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి, పాడైన తీగలను సరిచేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, సోమవారం నాటికి అన్ని చోట్లా పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు. లైన్లపై నుంచి వెళ్తున్న చెట్లను తొలగించి, లైన్లకు ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి

భీమడోలు: ఎయిడ్స్, హెచ్ఐవీ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాండిల్ ర్యాలీ, ప్రదర్శన చేసారు. తొలుత హెచ్ఐవీతో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, హెచ్ఐవీని సమాజం నుంచి దూరంగా చేయాలని నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. వివక్ష రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదామంటూ నినదించారు. ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జి.బాబూరావు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ అవగాహనతో సాధ్యమన్నారు. ఐసీటీసీ కౌన్సలర్ సింహాద్రి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అనేక సేవలు, పింఛన్ వంటి పథకాలు అందిస్తోందన్నారు. ఎన్‌జీవో సంస్థ మేనేజర్ శిరీషా, మానవత మండల చైర్మన్ గుల్లా నూకరాజు అప్పారావు, మానవత సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌ను సందర్శించిన జిల్లా గవర్నరు

ఉంగుటూరు: చేబ్రోలు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమైనవని లయన్స్ జిల్లా గవర్నర్ డా. పంకజాక్షన్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆడిటోరియంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి అడపా శోభరాణి నివేదిక సమర్పించారు. సంవత్సర కాలంలో నిర్వహించిన సేవాకార్యాక్రమాలు వివరించారు. లయన్స్ ఆడిటోరియం రెండో అంతస్తు నిర్మాణాన్ని లయన్స్ గవర్నరు పరిశీలించారు. లయన్స్ ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.